# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత ఉపరాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ ఈరోజు జరగనుంది.**
2. **ప్రజలకు పౌరసేవల్ని మరింతగా మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**
3. **హైదరాబాద్ తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు మూసీ నది కాలుష్యాన్ని తొలగిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లో వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.**
5. **ఎరువులు అక్రమంగా రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆంధ్రప్రదేశ్పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.**

==========================

భారత ఉపరాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ ఈ రోజు జరగనుంది. ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఓట్ల లెక్కింపు ఈ రోజు సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. ఉపరాష్ట్రపతికి జరిగే ఎన్నికల్లో పార్లమెంటు ఉభయ సభల సభ్యులు ఓటు వేయనున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 788 మంది సభ్యులు ఉండగా, ప్రస్తుతం 781 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా బి. సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు.

-------------------------

ప్రజలకు అందించే పౌరసేవల్ని మరింతగా మెరుగుగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని సచివాలయంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విభాగాలు అందించే ఫించన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ వంటి పౌరసేవల పట్ల ప్రజలు సంతృప్త స్థాయి పెరగాలని తెలిపారు. ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా గణాంకాల ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలాగే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరించే అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

హైదరాబాద్ తాగునీటి సమస్యతో పాటు మూసీ నది కాలుష్యాన్ని తొలగిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండవ దశ, మూడవ దశ ద్వారా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నింపడం ద్వారా మూసీ నది పునరుజ్జీవం పథకానికి గండిపేట వద్ద ముఖ్యమంత్రి గత సాయంత్రం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రజాప్రతినిధులు ప్రాధాన్యతనివ్వాలని శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనకాపల్లిలో ఆయన నిన్న మాట్లాడుతూ, రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్నాయని చెప్పారు. అన్ని సమస్యలపై చర్చించేందుకు శాసన సభ్యులందరూ అసెంబ్లీకి రావాలన్నారు. ఈ సమావేశాల్లో అందరూ మాట్లాడేందుకు సమయం కేటాయిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

---------------------------

అవయవ దానంలో ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ విభాగం 2 వందల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో నిన్నటివరకు 2 వందల అవయవ మార్పిడి శస్త్రచికిత్సల నిర్దేశిత లక్ష్యాన్ని నాలుగు నెలలు మిగిలి ఉండగానే సాధించామని ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అవయవదానాన్ని ప్రోత్సహిస్తున్న జీవన్‌దాన్ అధికారులను, ఇందుకోసం ముందుకొచ్చిన దాతలు, వారి కుటుంబ సభ్యులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో 2015 నుంచి ఇప్పటివరకు 371 మంది నుంచి ఒక వెయ్యి 195 అవయవాలు సేకరించి, వేరేవారికి అమర్చామని చెప్పారు. జీవన్‌దాన్‌లో అవయవాల కోసం 4 వేల 796 మంది నమోదు చేసుకున్నారని, అవయవదానం చేసేందుకు దాతలు ముందుకురావాలని మంత్రి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వైద్య కళాశాలలను ప్రభుత్వ- ప్రయివేటు-భాగస్వామ్యం పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో వైద్య కళాశాల నిర్మాణాలను గత సాయంత్రం పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పీపీపీ పద్ధతిలో మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, అరకు వైద్య కళాశాలలను మొదట విడతలో పూర్తి చేస్తామన్నారు. మార్కాపురంలో కళాశాల నిర్మాణాలను పూర్తి చేసి 2026-27 విద్యా సంవత్సరంలో తరగతులు నిర్వహిస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎరువులు అక్రమంగా రవాణా చేసే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ - పీడీ చట్టం కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఏలూరులో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాష్ట్రంలో సరిపడా ఎరువులు ఉన్నాయని రైతులు అసత్య ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు.

--------------------------

"తెలుగు భాషే మన అస్తిత్వమని" ఎలుగెత్తి చాటిన ప్రజాకవి.. స్వాతంత్ర్య సమరయోధులు, 'పద్మవిభూషణ్' కాళోజీ నారాయణరావు జయంతిని ఈరోజు తెలంగాణా భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1914 సెప్టెంబరు 9వ తేదీన కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించిన ఆయన... తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠి, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో పలు రచనలు చేశారు. తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయటంలో ప్రసిద్ధిచెందిన కాళోజీ నారాయణరావు పలు రచనలు చేసి ప్రజాకవిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించిన కాళోజీ నారాయణరావు 2002 నవంబరు 13వ తేదీన తుదిశ్వాస విడిచారు.

--------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను జీఎస్టీలో తీసుకువచ్చిన నూతన సంస్కరణల పట్ల అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జీఎస్టీ సంస్కరణలు రైతులు, మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఔషధాలపై జీఎస్టీని తగ్గించడం వలన నగదు ఆదా అవుతుందని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాంబాయమ్మ తెలుపుతూ....

వాయిస్..25 సెకన్లు

--------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకొని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..26 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు పలు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================